
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 10 మార్చి 2025



మినుము రైతు వెతలు

ఈ ఏడాది మినుము పంట సాగు చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. తుఫాన్లు, వరదల కారణంగా సాగు ఆలస్యం కావడంతో దిగుబడి ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లకు పడిపోయింది. గతేడాది క్వింటా రూ.7,700 పలికిన ధర ఈ ఏడాది రూ.7,200 వద్దే ఆగిపోయింది. పంట అమ్ముకుంటే పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,400లకు పంట కొనుగోలు చేసి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు.

ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లకు మించని దిగుబడి

సాగు ఆలస్యం కావడంతో తగ్గిన దిగుబడులు

మార్కెట్‌లో లభించని మద్దతు ధర ● గతేడాది క్వింటా రూ.7,700.. ఈ ఏడాది రూ.7,200 ● దిక్కుతోచని స్థితిలో రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 3.50 లక్షల ఎకరాల్లో రైతులు మినుము పంటను సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆగస్టు నెలాఖరు, సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, బుడమేరుకు వచ్చిన వరదల కారణంగా రోజుల తరబడి వరిపైరు నీటిలో ఉండి చనిపోయింది. దీంతో రైతులు రెండో విడతగా వరినాట్లు వేశారు. ఈ కారణంగా వరికోతలు ఆలస్యమయ్యాయి. వరి కోతల సమయంలో వర్షాలు కురవడంతో యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేసిన రైతులు, పొలాలను దమ్ముచేసి మరీ మినుము విత్తనాలు చల్లారు. రబీ సీజన్‌లో మినుము సాగుకు సంబంధించి 20 నుంచి నెల రోజుల పాటు ఆలస్యం కావడంతో ఆ ప్రభావం మినుము పంట దిగుబడిపై పడింది.


రోడ్డుపై ఆరబెట్టిన మినుము

పురుగు మందులకు అధికంగా ఖర్చు

రైతులు అన్ని జాగ్రత్తలు తీసుకుని మినుము పంటను సాగు చేస్తే ఎకరానికి కనీసంగా ఆరు క్వింటాళ్లు, అధికంగా ఎనిమిది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది పంట సాగుకాలం కొంతమేర అనుకూలించకపోవడంతో కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు, తోట్లవల్లూరు, దివిసీమ ప్రాంతంలోని చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ తదితర మండలాల్లో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల దిగుబడికి మించి రావడం లేదు. ఈ ఏడాది మినుము సాగులో పురుగు మందులకే ఎకరానికి రూ.20 వేలకు తక్కువ కాకుండా రైతులు ఖర్చుచేశారు. మినుము పైరుకు మిగతా 6లో..

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,400

ప్రభుత్వం ఈ ఏడాది మినుము క్వింటా మద్దతు ధరను రూ.7,400 నిర్ణయించింది. మినుములో నాణ్యత తక్కువగా ఉంటే ధర తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులు రైతుల నుంచి మినుమును కొనుగోలు చేసి తెనాలి, గుంటూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. గతేడాది క్వింటా మినుము రూ.7,200లకు కొనుగోలు చేయగా, ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బండ పాలిష్ రకం మినుముకు మాత్రం వంద రూపాయలు అధికంగా ధరను పెంచి రూ.7,300లకు కొనుగోలు చేస్తున్నారు. అదికూడా మార్కెట్ ఒడిదుడుకులను బట్టి ప్రతిరోజూ మినుము ధరల్లో హెచ్చుతగ్గులను అంచనా వేసి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది మినుము మద్దతు ధర క్వింటాకు బహిరంగ మార్కెట్‌లో రూ.8 వేల వరకు పలుకుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. మినుము తీతలో ఖర్చులు తగ్గించుకునేందుకు యంత్రాల ద్వారా కోత కోయిస్తే ఆ మినుము దుమ్ము, ధూళితో ఉండి పాలిష్ సక్రమంగా కనపడకపోవడంతో తక్కువ ధర చెల్లిస్తామని వ్యాపారులు అంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ధాన్యం బస్తాకు రూ.200 వరకు తక్కువ ధరకే విక్రయించారు. ఈ లోటును మినుము దిగుబడి ద్వారా వచ్చే ఆదాయంతో భర్తీ అవుతుందని రైతులు ఆశించారు. మినుము దిగుబడులు తగ్గడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మినుము కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనడం, తాగడం అక్కడే!

బార్‌లను తలపిస్తున్న వైన్‌షాపులు

యథేచ్ఛగా అనధికారిక పర్మిట్ రూమ్‌లు

మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు


కొండపల్లిలో వైన్‌షాపు వెనుక ఏర్పాటు చేసిన షెడ్‌లో కూర్చుని తాగుతున్న మందుబాబులు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం): ఇబ్రహీంపట్నం మండలంలోని కొండపల్లి, ఇబ్రహీంపట్నం, దావులూరు, జూపూడి డొంకరోడ్డు, గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్, కాచవరం తదితర ప్రాంతాల్లోని వైన్స్ షాపులు బార్‌లను తలపిస్తున్నాయి. మందుబాబులు వైన్ షాపు వద్దే మందు కొనుగోలు చేసి, అక్కడే తాగి వెళ్తున్నారు. ప్రధానంగా విజయవాడ-చత్తీస్‌గఢ్ జాతీయ రహదారి-30 పక్కనే కొండపల్లి ఏపీహెచ్ఎమ్ఈఎల్ రోడ్డు పక్కన రెండు మద్యం షాపులు ఉన్నాయి. వాటి వెనుక రేకుల షెడ్లు వేసి అందులో మందు బాబులు తాగేందుకు ఏర్పాట్లు చేశారు. అన్ని అక్కడే లభిస్తుండటంతో వైన్ షాపులకు వచ్చే మందుబాబులు వారి ద్విచక్రవాహనాలను రహదారి మార్జిన్‌పై అడ్డదిడ్డంగా నిలిపివేస్తున్నారు. ఆటోల్లో వచ్చే వారు ఆటోలను సైతం రహదారి మీదే ఆపి వైన్‌షాపులోకి వెళుతున్నారు. ఈ క్రమంలో ఇక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. నిత్యం ఈ రెండు వైన్‌షాపుల వద్ద ఇదే పరిస్థితి. పండుగ, సెలవు రోజులు, ఆదివారాల్లో అయితే ఒక జాతరను తలపిస్తోంది. వైన్‌షాపుల వద్దే తాగిన వారు ద్విచక్ర వాహనాలతో ఒకే సారి రోడ్డు మీదకు వచ్చేస్తూ, ఇష్టానుసారం రాంగ్ రూట్‌లో నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. జి.కొండూరు మెయిన్ సెంటర్లో ఉన్న వైన్ షాపు వద్ద మందు బాబులు చేస్తున్న వికృత చేష్టలతో పులివాగు వంతెనపై నడిచి వెళ్లే పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం షాపుల వద్ద నడుస్తున్న అనధికార బార్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రయోజనాలు ఆగిపోతాయ్

జలవనరుల శాఖ ఉద్యోగి కుటుంబానికి బెదిరింపులు!

వేధింపులు తాళలేక ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గుమస్తా వినోద్

- సూసైడ్ నోట్‌లో ముగ్గురి పేర్లు రాసిన గుమస్తా
- కేసు నీరుగార్చేందుకు కుట్రలు


వినోద్(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) 'జరిగిందేదో జరిగింది. ఇక ఇక్కడితో ఆగిపోండి. కేసులు, కోర్టులు అంటూ ముందుకు వెళ్లకండి. అలా కాదని అడుగు ముందుకు వేశారో మీకే నష్టం. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలన్నీ ఆగిపోతాయి' అంటూ జలవనరుల శాఖ నది పరిరక్షణ విభాగంలో రొయ్యూరు సెక్షన్‌లో పనిచేసే గుమస్తా కుటుంబానికి పలువురి నుంచి బెదిరింపులు వచ్చాయి. వివరాల్లోకి వెళితే... రొయ్యూరు నుంచి ఘంటసాల మండలం పాపనాశనం వరకు నది పరిరక్షణ విభాగానికి చెందిన సెక్షన్‌లో పనిచేసే గుమస్తా కన్నేటి వినోద్ కొద్దిరోజుల క్రితం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. చనిపోవడానికి ముందు ఆయన ఒక కాగితంపై తన చావుకు కారుకుల పేర్లను రాశాడు. అందులో నది పరిరక్షణ విభాగం జేఈ శ్రీరామ జనార్ధన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సుజాత పేర్లు ఉన్నట్లు సమాచారం. దీనితోపాటు తన అత్త కనకదుర్గ పేరునూ వినోద్ రాసినట్లు తెలిసింది. వినోద్ ఆత్మహత్యతో తమకు ఎలాంటి సంబంధం లేదని, తామంతా పని నిబంధనల ప్రకారమే వ్యవహరించామని ఈ పేర్లు ఉన్న వారు చెబుతూ వచ్చారు. వినోద్ ఆత్మహత్య విషయంలో తెర ముందు ఒకటి చెబుతుంటే, తెర వెనుక మరొకటి జరుగుతున్నట్టు జలవనరుల శాఖ ప్రాంగణంలో చర్చ నడుస్తోంది. వాస్తవానికి ఘటన జరిగిన రోజున వినోద్‌ను ముందుగా ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తర్వాత అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి మిగతా 6లో..

ఎటూ తేల్చుకోలేని స్థితిలో వినోద్ కుటుంబం

వినోద్ పదోన్నతుల జాబితాలో ఉన్నాడని సమాచారం. జలవనరుల శాఖలో పదోన్నతుల ప్రక్రియ పట్టాలు ఎక్కితే అతడికి ఇంజనీర్ హోదా దక్కుతుంది. ఆయన ప్రేమవివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమకు ఎలాంటి కేసు, దర్యాప్తులు, విచారణలు అవసరం లేదని వినోద్ కుటుంబ సభ్యులతో పోలీసులకు చెప్పించే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసును ఉపసంహరించుకుంటే శాఖ తరఫు నుంచి రావాల్సిన ప్రయోజనాలను చకచకా ఇప్పిస్తామని వారికి భరోసా ఇస్తూనే కేసును మనుగడలో ఉంచితే ఎలాంటి ప్రయోజనాలు అందవని బెదిరింపులకు దిగుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం వినోద్ కుటుంబ సభ్యులు విషాదంలో ఉండడంతో వారు ఏమీ తేల్చుకో లేకపోతున్నారు. పటమట పోలీసులు మాత్రం కేసును దర్యాప్తు చేసి తీరతామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఈ లేఖలో పేరు ఉన్న ఒకరు నది పరిరక్షణ విభాగంలో విధులకు నిత్యం హాజరవుతూ జోక్‌లు వేస్తూ గడుపుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. వినోద్ కాగితంపై పేరు రాసినంత మాత్రాన తనకేమీ కాదన్న ధీమాను ఆయన ప్రదర్శిస్తున్నట్లు సమాచారం.

విజయవాడ 2.0

న్యూ విజయవాడగా రూపుదిద్దుకుంటున్న మెగాసిటీ

విస్తరిస్తున్న ఉత్తర, ఈశాన్య, వాయువ్య ప్రాంతాలు

- నిన్నటి వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు చుట్టూనే..
- ఇప్పుడు విజయవాడ వెస్ట్ బైపాస్ దాటి విస్తరణకు అడుగులు
- గొల్లపూడి, జక్కంపూడి, నున్న ప్రాంతాల వైపు వేగంగా..
- గుణదల రెవెన్యూ గ్రామం నుంచి ఇన్నర్ వరకు..
- వెదురుపావులూరు ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్, రెసిడెన్షియల్స్
- కేసరపల్లి ఐటీ కంపెనీల వైపు మెగా హౌసింగ్ నిర్మాణం
- కానూరు - నిడమానూరు దిశగా నగరీకరణ
- జాతీయ రహదారి ప్రాజెక్టులన్నీ ఈ ప్రాంతాల్లోనే ఉండటంతో మరింత అభివృద్ధి


రామవరప్పాడు ఫ్లైఓవర్ వైపు పెరుగుతున్న నగరం

నగరం విస్తరిస్తోంది. న్యూ విజయవాడగా రూపుదిద్దుకుంటోంది. విజయవాడ 2.0గా శివారు ప్రాంతాల వైపు నగరాభివృద్ధి చురుగ్గా సాగుతోంది. ఈ మార్పులు గ్రేటర్ విజయవాడ తక్షణ అవసరాన్ని గట్టిగా సూచిస్తున్నాయి. విజయవాడను ఆనుకుని ప్రధానంగా ఉత్తర భాగంలో గుణదల రెవెన్యూ గ్రామానికి అనుసంధానంగా ఉన్న వెదురుపావులూరు నుంచి కేసరపల్లి వరకు, అలాగే జక్కంపూడి నుంచి నున్న వరకు, గొల్లపూడి - ఇబ్రహీంపట్నం - కొండపల్లి వరకు, కానూరు నుంచి నిడమానూరు వరకు నగరం మరింత విస్తరిస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ ఉత్తర, ఈశాన్య, వాయువ్య ప్రాంతాలు నగరంతో సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుతం విజయవాడ నగరంలో జనాబా పెరగడంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ పరిస్థితుల్లో విజయవాడ శరవేగంగా అభివృద్ధి చెందటానికి, విస్తరించటానికి శివారు ప్రాంతాలే వనరులుగా మారాయి. విజయవాడ భౌగోళిక పరిస్థితుల రీత్యా దక్షిణ భాగాన కృష్ణానది ఉంది. దీంతో అటు వైపు విస్తరించటానికి అవకాశం లేదు. విజయవాడ నగరం రెండున్నర దశాబ్దాలుగా ఎన్‌హెచ్ - 65 వెంబడి సరళరేఖలా విస్తరిస్తూ పోతోంది. విజయవాడ నగరం ఒక ప్రణాళికా బద్ధంగా విస్తరించాలంటే.. చతురస్రాకారంగా అభివృద్ధి చెందటం ముఖ్యమన్న వాదనలు అప్పట్లో వచ్చాయి. దశాబ్దంన్నర కాలంలో ఎన్‌హెచ్ - 16 వెంబడి కూడా విజయవాడ నగరం విస్తరిస్తోంది. ఎన్‌హెచ్ - 65 వెంబడి విస్తరించినంత వేగంగా అయితే లేదు.

గ్రేటర్ ఆశలను చిదిమేసిన గత వైసీపీ ప్రభుత్వం

రాష్ట్ర విభజన నేపథ్యంలో అమరావతి రాజధాని ప్రాంతంలో అంతర్భాగంగా ఉన్న విజయవాడ నగరాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెయ్యటానికి గత టీడీపీ ప్రభుత్వం గ్రేటర్ అంశాన్ని తెరమీదకు తెచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 18 గ్రామాలను గ్రేటర్ విలీన జాబితాలో చేర్చాలని పెట్టినా.. ఆ తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే గ్రేటర్ విజయవాడలో కదలిక మిగతా 6లో..

జాతీయ రహదారి ప్రాజెక్టులతో వేగం

జాతీయ రహదారి ప్రాజెక్టులు సరికొత్త విజయవాడ నగరానికి అడుగులు వేయిస్తున్నాయి. జక్కంపూడి నుంచి విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు అతి త్వరలో జరగనున్నందున ఈ ప్రాంతానికి మరింతగా డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే అలైన్‌మెంట్ పరిధిలో పెద్ద సంఖ్యలో భూముల కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు నేపథ్యంలోనే విజయవాడ ఈ ప్రాంతం వైపు విస్తరిస్తుందనుకుంటే.. విజయవాడ వెస్ట్ బైపాస్ నిర్మాణంతో మరింత విస్తరణకు దోహదపడింది. ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్లు కూడా ప్రతిపాదనలో ఉండటంతో రానున్న రోజుల్లో అవి కూడా కార్యరూపం దాల్చితే విజయవాడ అభివృద్ధి విజయవాడ వెస్ట్ బైపాస్ పరిధి దాటి కూడా ఇంకా ముందుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ జాతీయ రహదారులన్నింటి కారణంగా.. విజయవాడ ఉత్తర, ఈశాన్య, వాయువ్య ప్రాంతాలు శరవేగంగా విస్తరించనున్నాయి.



ఉత్కంఠగా ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ క్రీడా పోటీలు

● చిన అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో నిర్వహణ 6లో



ఇఫ్తార్ (సాయంత్రం) : 6-20 (సోమ)
సహర్ (ఉదయం) : 5-00 (మంగళ)

థియేటర్లలో క్రికెట్ మ్యాచ్ ప్రదర్శన

నేరుగా హోంశాఖ నుంచి అనుమతి తెచ్చుకున్న ఓ నిర్మాణ సంస్థ

సమాచారం ఇవ్వకపోవడంపై జిల్లా అధికారుల అసహనం

విజయవాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వరల్డ్ చాంపియన్ ట్రోఫీలో ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను విజయవాడలో రెండు థియేటర్లలో ప్రదర్శించారు. పటమట, గాంధీనగర్‌లో ఉన్న థియేటర్లలో ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆ థియేటర్ల యాజమాన్యం జిల్లా అధికారులతో సంబంధం లేకుండా నేరుగా హోంశాఖ నుంచి అనుమతి తెచ్చుకోవడం చర్చనీయాంశమైంది. థియేటర్లలో ఇలాంటి ప్రదర్శనలు చేయాలనుకున్నప్పుడు, బహిరంగ ప్రదేశాలు, స్టేడియంల్లో లైవ్ స్క్రీన్లు ఏర్పాటు చేయాలనుకున్నప్పుడు ముందుగా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. పోలీసులు, రెవెన్యూ అధికారులు అన్ని అంశాలను పరిశీలించి అనుమతి ఇస్తారు. ఇలా జిల్లా అధికారులకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోకుండానే హోం శాఖ కార్యదర్శి నుంచి అనుమతి తెచ్చుకున్నారు. ఇలా అనుమతి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ప్రదర్శనలు చేసిన థియేటర్ల యాజమాన్యం ఆ పని చేయలేదు. ఈ థియేటర్లలో ప్రదర్శనలు జరుగుతున్నాయని బయట వ్యక్తులు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు తమ సిబ్బందిని పంపి విచారణ చేయించగా హోం శాఖ కార్యదర్శి ఇచ్చిన అనుమతి కాపీని ఆ సంస్థ మేనేజర్ చూపించాడు. ఇదే విషయాన్ని సిబ్బంది అధికారులకు తెలియజేశారు. దీనిపై అధికారులు ఆ సంస్థ వ్యవహరించిన తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

భక్తులతో పోటెత్తిన సుబ్బారాయుడి ఆలయం

● ఒక్కరోజు ఆదాయం 9.85 లక్షలు 6లో

జిల్లాకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టాలి

● రంగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో పలువురు డిమాండ్

రమణయ్య నాయుడు నేటితరానికి స్ఫూర్తిదాయకం

- మంత్రి కొల్లు, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే మండలి
- ఘనంగా మాజీ ఎమ్మెల్యే కేపీ రమణయ్య నాయుడు 135వ జయంతి వేడుకలు

6లో



తొలి విడతలో నిరాశే!

ఐదుగురు ఆశావహుల్లో ఏ ఒక్కరినీ వరించని ఎమ్మెల్సీ

నేతలకు అధిష్ఠానం నుంచి బుజ్జగింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎమ్మెల్సీ పదవులు ఆశించిన వారిలో ఎవరికీ తొలి విడతలో చోటు దక్కలేదు. పరిమిత స్థానాలు మాత్రమే ఉండటం, ఆశావహుల జాబితా ఎక్కువగా ఉండటంతో అధిష్టానానికి ఈ వ్యవహారం కత్తిమీద సాముగా మారింది. దీనికి తోడు కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీలకు కూడా కేటాయించాల్సి రావటంతో.. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆశించిన ఐదుగురికి ఎమ్మెల్సీ పదవులు దక్కలేదు. ఎన్టీఆర్ జిల్లా నుంచి బుద్దా వెంకన్న, దేవినేని ఉమామహేశ్వరరావు, వంగవీటి రాధాకృష్ణ, నెట్టెం రఘురామ్‌తో పాటు కృష్ణాజిల్లాకు చెందిన పరుచూరి అశోక్‌బాబు ఎమ్మెల్సీ స్థానాలను ఆశించారు. వీరిలో బుద్దా వెంకన్న, దేవినేని ఉమా, వంగవీటి రాధాకృష్ణల్లో ఒకరికి ఖచ్చితంగా చాన్స్ దక్కవచ్చన్న ఊహాగానాలు నడిచాయి. ఆదివారం ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితా విడుదల చేయనుండటంతో ఆశావహులంతా నరాలు తెగే మిగతా 6లో..

గురుకుల ఎంట్రన్స్‌కు దరఖాస్తుల గడువు 13

గన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై. యశోదలక్ష్మీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ఏపీ బీఆర్ఏజీ సెట్-2025 నోటిఫికేషన్ విడుదలైందన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తుకు ఈ నెల 13 చివరి తేదీ అని తెలిపారు. వివరాలకు 91216-14398 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.



స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లలో బారులు తీరిన భక్తులు

భక్తులతో పోటెత్తిన సుబ్బారాయుడి ఆలయం

● ఒక్కరోజు ఆదాయం రూ.9.85 లక్షలు

మోపిదేవి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం భక్తులతో కిటకిటలాడగా, ఒక్కరోజులోనే రూ.9.85,982 ఆదాయం వచ్చింది. ఆదివారం సెలవుదినం కావటంతో పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిదర్శనానికి బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

గుడ్లవల్లేరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళుతున్న వృద్ధుడిని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనగా సంఘటన స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్ఐ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని చంద్రాలకు చెందిన ఆతుకూరి వెంకటరామరాజు గుడ్లవల్లేరు నుంచి కౌతవరం సైకిల్‌పై వెళుతుండగా ఏలూరు నుంచి మచిలీపట్నం వెపు వెళుతున్న ఏపీ 39టీఎఫ్ 4431 ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. సంఘటనా స్థలంలోనే రామరాజు మృతి చెందగా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి 'మీకోసం'

మచిలీపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణా,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్నికల కోడ్ కారణంగా నెలరోజులుగా నిలిచిపోయిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)ను సోమవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్టు కలెక్టర్ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలుతో పాటు డివిజన్, మండలస్థాయి కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సోమవారం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కృత్రిమ మేథ పోటీల్లో 'పేట' విద్యార్థి ప్రతిభ

● రెండోస్థానంతో నిలిచి 5వేల యూరోల క్యాష్‌ప్రైజ్ సొంతం

జగ్గయ్యపేట: స్థానిక జేఆర్సీ కళాశాల పూర్వ విద్యార్థి తిక్కిశెట్టి ధృతి స్పెయిన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నిర్వహించిన పోటీల్లో తన బృందంతో కలిసి రెండో స్థానం నిలిచి 5వేల యూరోల నగదు బహుమతిని గెలుపొందింది.

గీత దాటితే బుక్కే..!

కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాన్ని ఏదో ఒకలా ఆపుతున్నారా? సరిగ్గా జీబ్రా క్రాసింగ్ గీతపై ఆగుతున్నారా? దీనికి వెనుకుండే స్టాప్‌లైన్ల దాటేస్తున్నారా? ఇక నుంచి ఇలాంటి చిత్రాలు కూడళ్లలో కుదరవు. ట్రాఫిక్ పోలీసుల జాబితాలో ఉల్లంఘనులుగా ఉండిపోతారు. నగరంలో ఎక్కడెక్కడ తిరిగినా ఇంటికి వెళ్లేసరికి చలానా సందేశం మీ ఫోన్ నంబర్‌కు వస్తుంది. ఇలాంటి ఉల్లంఘనలను గుర్తించడానికి కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతి, విజయవాడ



నగరంలో కఠినంగా మారుతున్న ట్రాఫిక్ నిబంధనలు

మిలియన్ సిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఐటీఎంఎస్ (ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం) ఏర్పాటు చేశారు. విజయవాడలో మొత్తం 20-25 కూడళ్లలో ఈ ఐటీఎంఎస్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తొలి దశ పనులు పూర్తయ్యాయి. కూడళ్లలో సిగ్నల్ లైట్లతోపాటు ఆ స్తంభాలపై సీసీ కెమెరాలుంటాయి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలను గుర్తించి రికార్డు చేసుకుంటాయి. ఆ డేటా మొత్తం ఎంజీ రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చేరుతుంది. దీన్ని పరిశీలించి అక్కడి సిబ్బంది వాహనదారులకు చలానా విధించి సందేశం పంపుతారు. ప్రస్తుతం డీసీపీ బంగ్లా, అప్సర కూడలితోపాటు మరో రెండు కూడళ్లలో ఐటీఎంఎస్ అమల్లోకి వచ్చింది.

వాహనదారులతో వాదనలు లేకుండా..

పోలీసులు నగరంలో ట్రాఫిక్ నిబంధనలను కఠినతరం చేయడం మొదలు పెట్టినప్పటి నుంచి వాహన తనిఖీల్లో నిత్యం వివాదాలు జరుగుతున్నాయి. ముందుగా హెల్మెట్లను తలపైకి ఎక్కించడం మొదలుపెట్టారు. ఉల్లంఘించిన వారి వాహనాలను సీజ్ చేశారు. దీంతో హెల్మెట్ ధారణ 90 శాతానికి పెరిగినట్టు పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈనెల 1 నుంచి ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలను భారీగా పెంచారు. కేంద్ర రవాణా శాఖ రూపొందించిన ఈ చట్టాన్ని 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. కూడళ్లలో వాహనదారులు, పాదచారుల్లో ఒక క్రమశిక్షణ తెచ్చేందుకు పోలీసులు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. కొంతమంది జీబ్రా క్రాసింగ్ పైకి వచ్చి వాహనాలను ఆపుతున్నారు. మరికొంతమంది వెనుక ఉండే స్టాప్‌లైన్‌పైకి వస్తారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాలన్నీ స్టాప్‌లైన్‌కు ముందుగానే ఆగిపోవాలి. కాస్మోపాలిటన్ నగరాల్లో స్టాప్‌లైన్‌ను తాకితే అక్కడుండే సీసీ కెమెరాలు రికార్డు చేస్తాయి. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ట్రాఫిక్ పోలీసులు వీడియోవాల్‌పై గుర్తించి నేరుగా వాహనదారులకు జరిమానాల సందేశాలను పంపుతారు. ఇదే విధానాన్ని విజయవాడలోనూ అమలు చేస్తున్నామని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. రెడ్‌సిగ్నల్ పడినప్పుడు వాహనాలు స్టాప్‌లైన్‌కు ముందు ఆగాలి. ఒక వైపు నుంచి మరో వైపునకు వెళ్లే పాదచారులు జీబ్రాక్రాసింగ్ గీతలపై నడవాలి. స్టాప్‌లైన్ ఉల్లంఘనతో పాటు హెల్మెట్ ధరించకపోయినా, ఆటోడ్రైవర్లు ఖాకీ చొక్కా ధరించకపోయినా, నిషేధిత ప్రదేశంలో వాహనాలను నిలుపుదల చేసినా ఇక నుంచి కూడళ్లలోని సీసీ కెమెరాల ద్వారా గుర్తించి జరిమానాలు విధిస్తామని సీపీ వెల్లడించారు. ఈ తరహా జరిమానాలను కాస్మోపాలిటన్ నగరాల్లో కాంటాక్ట్‌లెస్ చలాన్లుగా వ్యవహరిస్తారు.



Scan me..

క్యూఆర్ కోడ్ ఉపయోగించి అభిప్రాయాలు తెలపాలంటున్న కలెక్టర్

పీ4 కార్యాచరణలో భాగస్వాములు కండి..!

● ఆలోచనలు పంచుకోండి.. మార్పునకు నాంది పలకండి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సీఎం దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పీ4 విధానం అమలుకు కసరత్తు జరుగుతోందని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లోని 10 సూత్రాల్లో మొదటి సూత్రమైన శూన్యపేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారం చుట్టనుందని, ప్రభుత్వం, దాతలు, ప్రజా భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందని వివరించారు. సామాజికంగా, ఆర్థికంగా పైనున్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగునున్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ4 విధానమన్నారు. దీనిపై ప్రజల సూచనలు తీసుకుంటామన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా హెచ్‌టీటీపీఎస్://స్వర్ణాంధ్ర.ఏపీ.జీఓవీ.ఇన్/పీ4 లింక్ ద్వారా ఈనెల 25లోగా అభిప్రాయాలు తెలియజేస్తే మీ సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రాన్ని అందజేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

ఉత్కంఠగా క్రీడాపోటీలు

● 26వ ఇంటర్ పురుషుల కబడ్డీలో సెమిస్‌కు చేరిన పలు జట్లు



కబడ్డీలో తలబడుతున్న క్రీడాకారులు

గన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ ఆధ్వర్యంలో మండలంలోని చిన అవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో 26వ ఇంటర్ పురుషుల క్రీడా పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఆదివారం కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. కబడ్డీలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడాకారులు గాయత్రి విద్య పరిషత్ మెడికల్ కళాశాలపై గెలిచి సెమీ ఫైనల్స్‌కు వెళ్లారు. నారాయణ డెంటల్ కళాశాల, కర్నూలు మెడికల్ కళాశాలపై, ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాల ఎన్నారై విశాఖపట్నంపై, నారాయణ మెడికల్ కళాశాల మహారాజ్ మెడికల్ కళాశాలపై గెలుపొంది సెమిస్‌కు చేరారు. బాల్ బ్యాడ్మింటన్‌లో ఆంధ్ర మెడికల్ కళాశాల ఎన్నారై వైజాగ్‌పై గెలుపొందారు. విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల కాటూరు మెడికల్ కళాశాలపై, పిన్నమనేని సిద్ధార్థ కళాశాల కర్నూల్ మెడికల్ కళాశాలపై గెలుపొందారు. వాలీబాల్‌లో పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల కాటూరి మెడికల్ కళాశాలపై గెలుపొందగా, గౌతమ్ డెంటల్ కళాశాల ఎస్‌వీఎంసీ మెడికల్ కళాశాలపై పరాజయం పొందారు. రంగరాయ మెడికల్ కళాశాల ఏసీఎస్ఆర్ మెడికల్ కళాశాలపై గెలుపొందారు. సిద్ధార్థ మెడికల్ కళాశాల జీఎంసీ మెడికల్ కళాశాలపై విజయం సాధించారు. నంద్యాల జీఎంసీ, ఒంగోలు జీఎంసీపై గెలిచారు. చిత్తూరు అపోలో కళాశాల, జీఎంసీ శ్రీకాకుళం కళాశాలపై గెలుపొందారు. కర్నూల్ మెడికల్ కళాశాల కోనసీమ కళాశాలపై గెలుపొందారు. సిద్ధార్థ కళాశాల జీఎస్ఎల్ డెంటల్‌పై గెలిచారు. వైజాగ్ ఎన్నారైపై ఆశ్రమం మెడికల్ కళాశాల గెలుపొందింది. గాయత్రి మెడికల్ కళాశాల పై గుంటూరు మెడికల్ కళాశాల విజయం సాధించింది. జీఎంసీ శ్రీకాకుళంపై రాజమండ్రి జీఎస్ఎల్ గెలుపొందింది. చెస్‌లో రంగరాయ మెడికల్ కళాశాల క్రీడాకరులు ఐదు రౌండ్లలో గెలిచి విన్నర్‌గా నిలిచారు. అనంతపురం మెడికల్ కళాశాల రెండో స్థానం, పిన్నమనేని సిద్ధార్థ 3వ స్థానంలో నిలిచింది. బాస్కెట్ బాల్‌లో ఎన్నారై మెడికల్ కళాశాలపై తిరుపతి ఎస్వీఎంసీ విజయం సాధించారు. నెల్లూరు ఏసీఎస్ఆర్ పై సిద్ధార్థ మెడికల్ కళాశాల గెలుపొందింది. ఆశ్రం కళాశాల గాయత్రి కళాశాలపై, కాటూరి మెడికల్ కళాశాల, విష్ణు డెంటల్ కళాశాలపై, కడప జీఎంసీ, మహరాజ్ మెడికల్ కళాశాలపై విజయం సాధించారు. అపోలో మెడికల్ కళాశాల, పిన్నమనేని సిద్ధార్థపై, మహరాజ్ మెడికల్ కళాశాల, ఆశ్రం మెడికల్ కళాశాలపై గెలుపొందారు. కోనసీమ కళాశాల, కాటూరి మెడికల్ కళాశాలపై, రాజమండ్రి జీఎస్ఎల్, వైజాగ్ ఏఎంసీపై విజయం సాధించారు.

విజయవాడ 2.0

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. అప్పట్లో ఏకంగా 45 గ్రామాలను గ్రేటర్ విలీన జాబితా పరిధిలోకి చేర్చి గ్రామ పంచాయతీల తీర్మానాలను తీసుకోవటం జరిగింది. నూటికి 90 శాతం పైగా గ్రామ పంచాయతీలు సానుకూలంగా తీర్మానాలు చేసి పంపాయి. నిర్ణయం తీసుకునే క్రమంలో ఎన్నికలు రావటంతో ఆగింది. గత వైసీపీ ప్రభుత్వం గ్రేటర్ ఆశలను చిదిమేసింది. విజయవాడ గ్రేటర్ పరిధిలో ఉన్న గ్రామాలను మునిసిపాలిటీలుగా మార్చింది. దీంతో విజయవాడ విస్తరణకు బ్రేక్ పడింది.

అయినా ఆగని అభివృద్ధి, విస్తరణ

అయినప్పటికీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ జాబితాలో చేర్చిన గ్రామాలు విజయవాడకు సమాంతరంగా కొత్త విజయవాడగా అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన గ్రేటర్ గ్రామాల వైపు విజయవాడ నగర విస్తరణ అంతకంతకూ పెరిగిపోతోంది. రామవరప్పాడు నుంచి ప్రారంభమయ్యే ఇన్నర్ రింగ్ రోడ్డు ఆవల వైపు సరికొత్త నగరమే తయారవుతోంది. పూర్తి నగరీకరణ దిశగా వేగంగా విస్తరించుకుంటూ పోతోంది. విజయవాడ పశ్చిమ బైపాస్‌ను దాటుకుని ఆవల వైపు కూడా విజయవాడ విస్తరిస్తోంది. వెదురుపావులూరు ఇంటర్నేషనల్ స్కూల్, భారీ పరిశ్రమలు, పబ్లికేషన్స్ సంస్థలు, తయారీ రంగ పరిశ్రమలు, గోడౌన్లు, షోరూమ్‌లు, సర్వీసు సెంటర్స్, ఎంఎస్ఎంఈ యూనిట్స్ వంటివి ఏర్పాటవుతున్నాయి.

వెలుస్తున్న భారీ అపార్ట్‌మెంట్లు

గుణదల రెవెన్యూ గ్రామంలో నివాస ప్రాంతాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. భారీ అపార్ట్‌మెంట్ల నిర్మాణం జోరుగా జరుగుతోంది. ఇప్పటికే అపార్ట్‌మెంట్ శ్రేణితో ఈ ప్రాంతం విస్తరణ బాట పట్టింది. గుణదల రైల్వే స్టేషన్ శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి జరుగుతోంది. ఇక్కడ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు అనుసంధానం కావటానికి వీలుగా క్రమేణా రెసిడెన్షియల్ కట్టడాలు విస్తరిస్తున్నాయి. వెదురుపావులూరు ఇండస్ట్రియల్, రెసిడెన్షియల్ మిశ్రమంగా విస్తరణ జరుగుతోంది. వెదురుపావులూరు నుంచి కేసరపల్లి వరకు అనేక రియల్ వెంచర్లు వెలుస్తున్నాయి. ప్రధానంగా కేసరపల్లి వైపు భారీగా విల్లాలు, అపార్ట్‌మెంట్లు, గ్రూప్‌హౌస్‌లు విస్తరిస్తున్నాయి. కేసరపల్లిలో ఐటీ పార్కులు, హెచ్‌సీఎల్ ఐటీ టెక్నాలజీస్ పార్కుల వైపు అయితే భారీగా విల్లాలు, గ్రూప్ హౌస్‌ల నిర్మాణం జరిగింది.

జోరుగా భూముల క్రయ విక్రయాలు

జక్కంపూడి, కండ్రిక, పాతపాడు, నున్న, అంబాపురం, పి.నైనవరం ప్రాంతాలు ఇప్పుడిప్పుడే విస్తరణ బాట పట్టాయి. విజయవాడ పశ్చిమ బైపాస్ కారణంగా ఈ ప్రాంతాల్లో భారీగా భూముల క్రయ, విక్రయాలు జరుగుతున్నాయి. కండ్రిక ప్రాంతం విజయవాడ బైపాస్‌కు దగ్గరగా ఉండటంతో ఈ ప్రాంతంలో నిర్మాణ రంగం శరవేగంగా జరుగుతోంది. విజయవాడ బైపాస్ కారణంగా నున్న, సూరంపల్లి వరకు అనూహ్యంగా నిర్మాణ రంగం విస్తరిస్తోంది. గొల్లపూడి ఇప్పటికే విజయవాడతో సమాంతరంగా విస్తరించింది. విజయవాడ బైపాస్ కారణంగా ఆవల వైపు కూడా విస్తరణ దిశగా ముందుకు వెళుతోంది. నగరం ఈశాన్య దిక్కున కానూరు ఇప్పటికే విస్తరించిన ప్రాంతం. ఇది మరింత విస్తరిస్తోంది. నిడమనూరు దిశగా ఈ ప్రాంతం విస్తరిస్తోంది. తూర్పు బైపాస్ ఆశలతో ఈ ప్రాంత అభివృద్ధి ముందుకు వెళ్లింది. తూర్పు బైపాస్ ఇక లేనప్పటికీ.. ఇన్నర్‌రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ ఆశలతో ఈ ప్రాంతం మరింత విస్తరణ దిశగా కదులుతోంది.

తొలి విడతలో నిరాశే!

(5వ పేజీ తరువాయి)

ఉత్కంఠతను అనుభవించారు. బుద్దా వెంకన్న తన నివాసంలో ఉండగా, ఆయన అభిమానులంతా సమీపంలోని కార్యాలయంలో టీవీకి అతుక్కుపోయారు. గొల్లపూడిలో దేవినేని ఉమా ఆఫీసు దగ్గర కూడా ఆయన అభిమానులు శుభవార్త కోసం ఎదురు చూశారు. ఉమాకు సీటు వస్తే బాణసంచా కాల్చటానికి రంగం సిద్ధం చేసుకున్నారు. వంగవీటి రాధా అనుయాయులు కూడా ఉత్కంఠగా ఎదురు చూశారు. అభ్యర్థులను ఖరారు చేయకముందే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆశావహులకు ఫోన్లు చేసి ఈ సారికి కొన్ని సమీకరణాల కారణంగా ఇవ్వలేకపోతున్నామని, తర్వాత దశలో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. ఇలా చెప్పిన వారిలో అశోక్‌బాబు, నెట్టెం రఘురామ్ ఉన్నారు. మిగిలి వారికి సోమవారం ఫోన్ చేసి చెప్పే అవకాశం ఉంది.

రమణయ్యనాయుడు నేటితరానికి స్ఫూర్తి

● మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ● ఘనంగా కేవీఆర్ 135వ జయంతి వేడుకలు

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం తొలితరం రాజకీయాలకు ఆద్యుడైన కేవీ రమణయ్యనాయుడు నేటి యువ రాజకీయ నేతలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. రావుబహద్దూర్, మాజీ ఎమ్మెల్యే, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రమణయ్య నాయుడు 135వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రమణయ్యనాయుడు కుటుంబ సభ్యులు విగ్రహ పునరుద్ధరణ చేపట్టిన నేపథ్యంలో జరిగిన వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు కేవీ రమణయ్య నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. బ్రిటీషు పాలకులను ఎదురించిన న్యాయవాదిగా కేవీ రమణయ్యనాయుడు పేరు పొందారన్నారు. ఆయన విగ్రహం ఉండే సెంటర్‌కు ఆయన పేరు పెట్టేందుకు మునిసిపాలిటీలో తీర్మానం చేయిస్తామన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ కేవీ రమణయ్య నాయుడు స్మృతి చిహ్నంగా ఒక ప్రాజెక్టును రూపకల్పన చేస్తే అందుకు కావాల్సిన స్థలం, నిధులు అందిస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఆగస్టు 16న గౌతు లచ్చన్న జయంతితో పాటు కేవీ రమణయ్య నాయుడు జయంతి కూడా ఏటా



సభలో ప్రసంగిస్తున్న మంత్రి రవీంద్ర చిత్రంలో ఎంపీ బాలశౌరి తదితరులు

నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అప్పట్లో రమణయ్య నాయుడుకు మంత్రి పదవి వచ్చినా జన్మ భూమి బందరుకే సేవ చేస్తానని చెప్పారన్నారు. జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ రమణయ్య నాయుడు అందరికీ ఆదర్శమన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ ఈ కూడలికి రమణయ్య నాయుడు పేరు పెట్టాలని ప్రతిపాదించగా మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా అనుకూలంగా మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రమణయ్యనాయుడు 30 ఏళ్ల పాటు న్యాయవాదిగా ఉంటూ ఏ కేసునైనా అనర్గళంగా గెలిచేవారన్నారు. రమణయ్య నాయుడు కుటుంబ సభ్యులు కేవీ రమణమూర్తి, కొనకళ్ల బుల్లయ్య, డా. బీ ధన్వంతరీ ఆచార్య, పంతం గజేంద్ర, గోపు సత్యనారాయణ, వాలిశెట్టి మల్లి, న్యాయవాది కూనపరెడ్డి శ్రీనివాసరావు, బుల్లెట్ ధర్మారావు, గడ్డం రాజు, లంకిశెట్టి నీరజ, హసీంబేగ్, పీవీ ఫణికుమార్, సోడిశెట్టి బాలాజీ, పేర్ని కృష్ణమూర్తి, మాదివాడ రాము, పల్లపాటి సుబ్రహ్మణ్యం, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్ పాల్గొన్నారు.

ప్రయోజనాలు ఆగిపోతాయ్

(5వ పేజీ తరువాయి)

తీసుకెళ్లారు. అప్పటికే వినోద్ ఊపిరి ఆగిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై వైద్యులు ఎమ్మెల్సీ (మెడికో లీగల్ కేసు) రాశారు. దీని ఆధారంగానే పోలీసులు కేసు నమోదు చేస్తారు. వినోద్ ఆత్మహత్యకు సంబంధించి ఎలాంటి పోలీసు కేసు లేకుండా చేయాలని కొంతమంది సతవిధాలా ప్రయత్నించారు. చివరికి పటమట పోలీసులు ఎమ్మెల్సీ ఆధారంగా కేసు నమోదు చేశారు. వినోద్ రాసిన లేఖను పోలీసులకు చేరకుండా జలవనరుల శాఖలో కొంతమంది చక్రం తిప్పారు.

ప్లాన్ 'బి' అమలు!

వినోద్ ఆత్మహత్య వ్యవహారం జలవనరుల శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన గురించి రవ్వంత సమాచారాన్ని కూడా బయటకు పొక్కనీయకుండా చేయాలని కొంతమంది ప్రయత్నించారు. చివరికి ప్రభుత్వాసుపత్రి నుంచి విషయం బయటకు పొక్కింది. ఆ రోజునే ఈ ఘటనను కోల్డ్ స్టోరేజ్‌లోకి పంపాలన ప్రణాళిక వేశారు. ఇది విఫలమవ్వడంతో జలవనరుల శాఖలోని ఒక వర్గం ప్లాన్ 'బి' అమలు చేస్తోంది. పోలీసులు కేసు నమోదు చేయడంతో లేఖలో పేర్లు ఉన్న వాళ్లంతా కచ్చితంగా విచారణకు హాజరుకావాల్సి ఉంది. ముఖ్యంగా జేఈ శ్రీరామ జనార్ధన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ సుజాతను పిలిపించి విచారించడానికి పటమట పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో వినోద్ కుటుంబానికి సుతిమెత్తని బెదిరింపులు వెళ్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

మినుము రైతు వెతలు

(5వ పేజీ తరువాయి)

ఎల్లోమొజాయిక్, ఆకుముడత, బూడిద తెగుళ్ల నివారణ కోసం, పూతరావడానికి, వచ్చి నపూత నిలబడటానికి, పిందె రాలిపోకుండా ఉండటానికి పలు దఫాలుగా వివిధ రకాల రసాయనాలను పిచికారీ చేయడంతో పురుగు మందుల ఖర్చు అధికమైంది. వివిధ రకాల పురుగు మందుల కంపెనీల ఏజెంట్లు మినుము పంట పొలాలను పరిశీలించి పైరుకు ఏవేవో తెగుళ్లు వ్యాపించాయని, వీటి నిర్మూలన కోసం పురుగు మందులను పిచికారీ చేయాలని తమదైన శైలిలో సూచనలు చేశారు. రైతుల్లో అధిక దిగుబడులు సాధించాలనే పోటీతత్వం పెరిగి విరివిగా పురుగు మందులను వినియోగించారు. దీంతో పాటు ఎకరానికి మినుము తీతకు రూ. 7 వేలు, పోగు చేసినందుకు రూ.2 వేలు, మిషన్ ద్వారా నూర్పిడి చేస్తే తూర్పార బట్టడానికి 70 కిలోల బస్తాకు రూ.250, ఇతరత్రా ఖర్చుల రూపంలో నూర్పిడికే రూ.10 వేలకు పైగా ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. ఈ ఖర్చులన్నీ కలుపుకుంటే ఎకరానికి కనీసంగా రూ.30వేలకుపైగా పెట్టుబడి అవుతోంది. దిగుబడి మాత్రం ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు మాత్రమే వస్తుండటంతో రైతులకు ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

జిల్లాకు వంగవీటి రంగా పేరు పెట్టాలి


● రంగా అభిమానుల ఆత్మీయ సమావేశంలో పలువురి డిమాండ్

గాంధీనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగా అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని ఆయన పేరును కృష్ణాజిల్లా లేదా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పెట్టాలని వంగవీటి మోహనరంగా సోషల్ ఆర్గనైజేషన్ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రంగా అభిమానుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రంగా-రాధా మిత్రమండలి నేత ముళ్లపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోహనరంగా పార్టీలు, కులమతాలకు అతీతంగా ప్రజానేతగా పేదల గుండెల్లో స్థానం సంపాదించారన్నారు. గన్నవరం విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రంగా తనయుడు టీడీపీ నేత రాధాకు ఎమ్మెల్సీతో పాటు మంత్రి పదవి ఇవ్వాలని వంగవీటి మోహనరంగా సోషల్ ఆర్గనైజేషన్ నేతలు డిమాండ్ చేశారు. త్వరలో సీఎం, డిప్యూటీ సీఎంలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను కలిసి వినతిపత్రాలు అందించేలా కార్యచరణ చేపడతామన్నారు. ఆర్గనైజేషన్ నేత అడపా ప్రతాప్‌చంద్, న్యాయవాదులు రాంపిళ్ల శ్రీనివాసరావు, పిల్లా రవి, చంద్రమౌళి, కాపునేతలు పచ్చిపల్ల రాజా, జయప్రకాష్, గెడ్డేటి జయ, విశ్వకర్మ సంఘం నేత పట్నాల హరి, బీజేపీ నేత గోపాలకృష్ణ, కాంగ్రెస్ నేత నరహరిశెట్టి నరసింహారావు, రంగిశెట్టి పార్వతీ పాల్గొన్నారు.

యువతను నమ్మించి మోసం చేసిన కూటమి

వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అవినాష్

గుణదల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): యువతకు ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి కూటమి నేతలు అధికారంలోకి వచ్చారని వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. యువతకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం తక్షణమే రిలీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న నగరంలో ఫీజు పోరు పేరుతో భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు అవినాష్ తెలిపారు. మేరకు పోస్టర్ ఆవిష్కరణ గుణదలలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ నేత పోతిన మహేశ్ పలు అభ్యంతరకర వాఖ్యలు చేశారు. జగన్మోహన్ రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తున్నారంటే వారి నాలికకు కొవ్వు పట్టిందని అర్థమని అలాంటి నాలికపైనున్న కొవ్వును కరిగిస్తామంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	160
చికెన్ స్కిన్‌లెస్	170

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

పిల్లల ఎదుగుదలలో లోపాలపై అవగాహన

పెనమలూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల(డీమ్డ్ టుబీ యూనివర్సిటీ)లో సిద్ధార్థ వాకర్స్ అసోసియేషన్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గమయా చైల్డ్ డెవలప్‌మెంట్ వారు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మేఘనా కశ్యప్ మాట్లాడుతూ, 30శాతం కంటే ఎక్కువ మంది పిల్లలు బిహేవియర్ డిజాస్టర్‌తో బాధపడుతున్నారని, పిల్లలు పుట్టినప్పుడు 25శాతం మాత్రమే మెదడు వృద్ధి చెంది ఉంటుందని, మిగిలిన 75శాతం 1-5సంవత్సరాల వయస్సు వరకు వృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోరి సూర్యనారాయణ, అరుణలు పాల్గొని వాకర్స్ క్లబ్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రెసిడెంటు యార్లగడ్డ రూప్‌కుమార్, సెక్రటరీ సతీష్, ట్రెజరర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కొల్లా నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కాలిపోయిన బైకు

బైకుకు నిప్పు

ఉయ్యూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు హనుమాన్‌నగర్‌లో చిమటా శోభనాద్రికి చెందిన మోటార్ సైకిల్‌కు శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. ఇటీవలే కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనం ఇంటి బయట పెట్టి నిద్రించగా ఆదివారం ఉదయానికి కాలిపోయి ఉండటం గమనించిన శోభనాద్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శోభనాద్రి కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.



దాయేరి మసీదులో ఇఫ్తార్

ఉయ్యూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం పురస్కరించుకుని దాయేరి మసీదులో ఆదివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ఉపవాసదీక్షలో ఉన్నవారు సాయంత్రం దీక్ష విరమించి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అబుకలాం, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, జలీల్ తదితరులు పాల్గొని సేవలందించారు. ఖాదర్‌సాహెబ్, సిరాజ్ ఉన్నీసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లింలతో పాటు, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పూర్ణచంద్రరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వీర్యం నుంచి సంపద వైపు..

- కూటమి ప్రభుత్వం రాకతో చెత్త సంపద కేంద్రాలపై దృష్టి
- కేసరపల్లిలో అందుబాటులోకి..
- వర్మీ కంపోస్టు తయారీ
- సేకరించిన చెత్త కొంత జిందాల్‌కు, మరికొంత ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుకు



వర్మీ కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మీమౌనిక, కార్యదర్శి ప్రసాద్

(గన్నవరం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం సంపద కేంద్రాలను నిర్వీర్యం చేసింది. వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. లక్ష నిధులతో నిర్మించిన షెడ్డును నామ రూపాలు లేకుండా తయారయ్యాయి. దీంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి దర్శనమిచ్చేవి. ప్రజలకు కూడా ఇబ్బందికరంగా మారింది. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే సంపద కేంద్రాలపై దృష్టి సారించింది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించటంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి పంచాయతీలో క్లాప్ మిత్ర, షెడ్ మిత్రలను ఏర్పాటు చేశారు. మండలంలోని కేసరపల్లిలో తడి , పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 2.5 టన్నుల చెత్తను జిందాల్‌కు తరలిస్తున్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు రూ.1.20లక్షలతో సోలార్‌ను ఏర్పాటు చేశారు. రూ.20వేలతో మోటారు ఏర్పాటు చేసి షెడ్‌కు రంగులు దిద్దారు. రూ.35వేలతో చుట్టూ ఫెన్సింగ్ వేసి రూ.లక్షతో ప్లాట్ ఫాంను సిద్ధం చేశారు. మరో రూ.30వేలతో మరుగుదొడ్డి నిర్మించనున్నారు. గ్రామంలో సేకరించిన పేడ, కొబ్బరి పీచుల, ఇతర వ్యర్థాలను సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రానికి తీసుకువెళుతున్నారు. అక్కడ వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేస్తూ పంచాయతీకి ఆదాయం చేకూరుస్తున్నారు. పంచాయతీ కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారు. ప్రస్తుతం 10 తొట్లలో వర్మీ కంపోస్టును తయారు చేస్తున్నారు. 5 క్వింటాళ్లకు పైగా సిద్ధంగా ఉందని చెబుతున్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయటంతో పాటు దానిలో కొంత సంపద కేంద్రానికి తరలిస్తున్నారు. మిగిలింది ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనల మేరకు కొనుగోలు చేసిన వాహనంలో గుంటూరు జిందాల్‌కు పంపిస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం

గ్రామంలో ప్రతి రోజు తడి, పొడి చెత్తను సేకరిస్తున్నాం. ఇప్పటికే ప్రతి ఇంటికి రెండు డస్ట్‌బిన్‌లు ఇచ్చాం. గ్రామస్తులకు అవగాహన కల్పించి ఆ రెండు డస్ట్‌బిన్‌లో తడి పొడి చెత్త వేర్వేరుగా వేయమని సూచిస్తున్నాం. స్వచ్ఛ గ్రామ దిశగా అడుగులు వేస్తున్నాం. గ్రామస్తులు కూడా మరింత సహకరించాలి.

- లక్ష్మీమౌనిక, సర్పంచ్ కేసరపల్లి

వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నాం

గ్రామంలో సేకరించిన వ్యర్థాలతో వర్మీ కంపోస్టును తయారు చేస్తున్నాం. ప్రస్తుతం పది తొట్లలో 5 క్వింటాలకు పైగా సిద్ధంగా ఉంది. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను ఆధునీకరించాం. చుట్టూ ఫెన్సింగ్ వేయటంతో పాటు రంగులు వేసి సోలార్‌ను ఏర్పాటు చేసాం. మట్టి, గ్రావెల్ పోసి మొక్కలు నాటాం.

- ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

లక్ష్మీతిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి విరాళాలు

గన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరం లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి ఆదివారం మర్లపాలెంకు చెందిన మేడసాని వెంకట చలపతిరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట రామకృష్ణారావు, భార్గవి దంపతులు రూ.50,020 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. మాజీ సర్పంచ్ కాసన్నేని గోపాలరావు సతీమణి అహల్య జ్ఞాపకార్థం వారి కుమారుడు శేషు వర్ధన్, విజయలక్ష్మీ దంపతులు రూ.1,00,116, కాసన్నేని ధర్మారావు, సంపూర్ణమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు కాసన్నేని బాబూరావు, బేబీ సరోజిని దంపతులు రూ.1,00,116, నర్రా రామారావు జ్ఞాపకార్థం వారి భార్య నిర్మల, కుమారుడు గిరిధర్, సౌభాగ్యలక్ష్మి దంపతులు రూ.1,00,008 విరాళాలను అందజేశారు. జాస్తి ఫణిశేఖర్, కాసన్నేని నాని, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ఉంగుటూరు : ఉంగుటూరు సెక్షన్ పరిధిలోని 33/11కేవీ నందమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియాలో మానికొండ ఫీడర్ లైన్ల మరమ్మతులు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 8 నుంచి 12గంటలవరకు మానికొండ గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జీబీ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హిందూ శ్మశాన వాటికలో రోడ్ల నిర్మాణం

గన్నవరం: మండలంలోని దావాజీగూడెం, అల్లాపురం గ్రామాలకు చెందిన హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి బిల్డర్ గుర్రం నాని ముందుకు వచ్చారు. సొంత నిధులు రూ. పది లక్షలతో శ్మశాన వాటిక ప్రాంగణంలో మూడు సిమెంట్ రోడ్లను వేస్తున్నారు. నాని పెదనాన్న, పెద్దమ్మలు గుర్రం సుబ్బయ్య, శేషారత్నం, భార్య రజని జ్ఞాపకార్థం ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు పెనమలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రెండున్నర కోట్ల రూపాయలను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో దాదాపు 20కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు నియోజకవర్గంలో పంపిణీ చేయగా.. గత వైసీపీ ప్రభుత్వం కనీసం లక్ష రూపాయలను ఈ పథకం కింద అందించలేదన్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్న వారు పోరంకిలోని టీడీపీ కార్యాలయాన్ని సంప్రదించిన పక్షంలో వారికి స్థానిక ఆసుపత్రుల్లో కనీసం నలభైశాతం తక్కువ ధరలతో వైద్యసేవలు అందేట్లు చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, వల్లభనేని సత్యనారాయణ, సగెపు రంగారావు, కోయ ఆనంద్‌ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ, అంగిరేకుల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచాలి

గన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం పనులను 200 రోజులకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కొండా వీరాస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని అల్లాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ ఆదివారం మన్నె గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు రూ.700 వేతనం చెల్లించాలన్నారు. అనంతరం మండల కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.గోవర్ధన్ ఉపాధ్యక్షుడిగా మాదవరపు రం గమ్మ, కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, నాగేశ్వరమ్మ, లెనిన్, గోపాలకృష్ణ, గౌరి శంకర్, లక్ష్మీ, జ్యోతి, సుభాషిణి, శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

గన్నవరం బాలోత్సవంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశా లలో గన్నవరం బాలోత్సవం అత్యంత ఉత్సాహంగా ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు బాలోత్సవం కమిటీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, బాలబాలికలు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లో, కళాత్మక, సాంఘిక రంగాల్లో రాణించాలని సూచించారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆటలు, పాటలు, డ్యాన్స్‌లు వంటి రంగాల్లో రాణిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఇదొక చక్కటి పిల్లల కార్యక్రమన్నారు. పిల్లల్లో మెకానికల్ స్కిల్స్‌ను తగ్గించి విజ్ఞానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మూడేళ్లుగా పెద్ద ఎత్తున బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్, గన్నె వెంకట్రావు, జాస్తి విజయభూషణ్‌కుమార్, కర్ర వరప్రసాద్, అనుమోలు వెంకటేశ్వరరావు, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వైస్ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, మరీదు వరప్రసాద్, దాసరి నవభారతి, కొమ్మినేని మధుసూదనరావు, మద్దుకూరి విజయ కుమార్ పాల్గొనగా వ్యాఖ్యాతగా కొల్లి సత్య జగదీశ్వరరావు వ్యవహరించారు.

గోకులాలు ప్రారంభం

విజయవాడ రూరల్ : ఉపాధి హామి నిధులతో విజయవాడ రూరల్ గ్రామాల్లో నిర్మించిన గోకులాలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదివారం ప్రారంభించారు. స్థానిక అప్పారావుపేట, మంగళాపురం, పాతపాడు గ్రామాల్లో ముగ్గురికి స్వయం ఉపాధి కింద పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికి రూ. 2.30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో లబ్ధిదారులు ఏర్పాటు చేసుకున్న గోకులాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణప్రసాద్, టీడీపీ నేతలు గుజ్జర్లపూడి బాబూరావు, గొడ్డళ్ల చిన్నరామారావు, కొండేటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



మానికొండలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ఉంగుటూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మానికొండ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పద్మావతీ, వేంకటేశ్వరస్వామి శాంతి కళ్యాణ మహోత్సవం ఆది వారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి తులసీదళాలతో ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు పర్వారి మురళీమోహన్ పెండ్లిపీటలపై పద్మావతీ, వేంకటేశ్వరస్వామి విగ్రహాలను కూర్చుండబెట్టి సంప్రదాయబద్ధంగా కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

సీతారామచంద్రమూర్తి దేవాలయంలో విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : బొమ్ములూరు సీతా రామచంద్రమూర్తి దేవాలయ శతాబ్ది మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ఆలయ గోపుర నూతన కలశ, నూతన ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మహా కుంభాభిషేక పూజలు ఆదివారం ఉదయం చిదానంద ఆశ్రమ, భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతీస్వామి చేతుల మీదుగా నిర్వహించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పం చ్ కాటూరి విజయభాస్కర్, ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, కొల్లి చందు, మొవ్వా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం

హనుమాన్‌జంక్షన్ : స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సామూహిక వేంకటేశ్వర స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు పర్యవేక్షణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతం ఆచరించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు అరుణ దంపతులు పూజా సామాగ్రిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమాన్ని ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఉయ్యూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉయ్యూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూ రు బార్ అసోసి యేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీ వంగా ఎన్నికైంది. 2025- 2026 సంవత్సరానికి జరి గిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాగిత గోపీచంద్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఉపాధ్యక్షుడిగా అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా పోతురాజు శ్రీరామ్‌ప్రసాద్, కోశాధికారిగా ఎల్. వసుధారాణి, గ్రంథాలయ కార్యదర్శిగా గీతాంజలి, క్రీడలు, సాంస్కృతిక విభాగ కార్యదర్శిగా వీరప్రతాపరెడ్డి, మహిళా కార్యదర్శిగా దివ్యాంజలి ఎన్నికయ్యారు.

కృష్ణానదిలో యువకుడి మృతదేహం

వన్‌టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో నుంచి బయటకు వెళ్లిన యువకుడు కృష్ణానదిలో శవమై కనిపించాడు. మృతదేహాన్ని పోలీసులు బయటకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎనికేపాడు ట్యాంక్ బజార్‌కు చెందిన పొట్నూరు జగదీశ్వర్‌రావు కుమారుడు వెంకట రమణ (23) వన్‌టౌన్ ప్రకాశం బ్యారేజి వద్దకు వచ్చి అదృశ్యమైనట్లు శనివారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కృష్ణానదిలో గాలించగా 48వ ఖానా వద్ద వెంకట రమణ మృతదేహం లభించింది. పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు తరలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొండాలమ్మ సేవలో మంత్రి కొల్లు

గుడ్లవల్లేరు,మార్చి9(ఆంధ్రజ్యోతి): వేమవరంలో వేంచేసియున్న కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం రాష్ట్ర గనులశాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కొండలరావు మంత్రి కొల్లుకు ఘనస్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి భక్తులు పాలపొంగళ్లు సమర్పించి, మొక్కుబడులను చెల్లించుకున్నారు. కొండలమ్మ అమ్మవారి దేవస్థాన దత్తత దేవాలయమైన అభయాంజనేయస్వామి 37వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారంస్వామికి స్నపన కార్యక్రమం నిర్వహించారు. చేశారు. సాయంత్రం స్వామికి శాంతి కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు.



మంత్రి కొల్లు రవీంద్రను సత్కరిస్తున్న కార్యనిర్వహణాధికారి కొండలరావు



కూచిపూడి జెడ్పీ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

కూచిపూడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో ఎన్ శివశంకర్ తెలిపారు. మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలలు, ఐదు ప్రయివేట్ పాఠశాలల నుంచి 508 మంది విద్యార్థులు ఏడు పరీక్షా కేంద్రాల ద్వారా పరీక్షలకు హాజరు కానున్నారు. విద్యార్థులందరికీ హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు. కూచిపూడి జెడ్పీ పాఠశాల నుంచి 27 మంది, చినముత్తేవి నుండి 20 మంది, మొవ్వ నుంచి 137 మంది, కోసూరు జెడ్పీ నుంచి 31, కాజ జెడ్పీ నుంచి 54, నిడుమోలు నుంచి 36 మంది, పెడసనగల్లు కేంద్రం ద్వారా 37, భట్లపెనుమర్రు నుంచి 39, పెదముత్తేవి ఓరియంటల్ హైస్కూల్ నుంచి 14 మంది పరీక్షలకు హాజరవుతారని ఆయన తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

పామర్రు,మార్చి9(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న పిఠాపురంలో నిర్వహించనున్న జనసేనపార్టీ ఆవిర్భావ సభను నియోజకవర్గంలోని జనసేనపార్టీ నేతలు, కార్యకర్తలు, పవన్ అభిమానులు విజయవంతం చేయాలని పామర్రు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ ఆపార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఈమేరకు ఐదుమండలాలకు చెందిన ఆ పార్టీనేతలతో కలసి జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆపార్టీనేతలు అంబటి రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడ సుబ్బారావు పాల్గొన్నారు.

తప్పని తాగునీటి కష్టాలు

● కాలుష్యం కోరల్లో జుజ్జవరం తాగునీటి చెరువు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పామర్రు): మండల పరిధిలోని జుజ్జవరం గ్రామంలో పాలకుల నిర్లక్ష్యంతో గ్రామస్థులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పంచాయతి తాగునీటి చెరువులో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా ప్రజలకు అందించడంలో పాలకులు విఫలమయ్యారనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించడంలో ముందు చూపు లేకపోవడంతో గ్రామంలో పలు వార్డుల్లో నీళ్లు సక్రమంగా సరఫరాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు మంచినీటి చెరువు నాచు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. తాగునీటిని కనీసం ఫిల్టరింగ్ చేయకుండానే గ్రామాల్లో సరఫరా చేస్తున్నారని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సరఫరాలో ఉన్న అవరోధాలు తొలగించి, ఫిల్టర్ చేసిన తాగునీటినే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



తాగునీటి చెరువులోని నాచు, ఇతర వ్యర్థాలను తొలగించాలి. ఈ విషయమై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారం రోజులవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

చెన్నకేశవులు



నాచు, ఇతర వ్యర్థాలతో నిండిన తాగునీటి చెరువు

సబ్సిడీ యంత్ర పరికరాల కొనుగోలుకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): 50 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాల కొనుగోలుకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి ఆదివారం తెలిపారు. సబ్సిడీపై యంత్ర పరికరాలు కావల్సిన వారు ఆయా గ్రామాల్లోని ఆర్‌ఎస్‌కే సెంటర్లలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. స్ప్రేయర్లు, ట్రాక్టర్ల విడిభాగాలపై సబ్సిడీపై అందజేస్తున్నామని తెలిపారు. మండల స్థాయిలో ఆర్‌ఎస్‌కేలో నమోదు చేసుకున్న రైతులను ఎంపిక చేస్తామన్నారు. అర్హత ఉన్న వారందరికీ యంత్ర పరికరాలు సబ్సిడీపై మంజూరు చేయనున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల రైతులు ఆర్‌ఎస్‌కే సెంటర్లలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

పామర్రు,మార్చి9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని వివిధగ్రామాలకు చెందిన 23మంది పేదకుటుంబాలకు వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధినుంచి మంజూరైన రూ.19,65,589 చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా తనకార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదుమండలాలకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ముగిసిన గంగానమ్మ జాతర

పామర్రు,మార్చి9(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులచే పూజలందుకుంటున్న పామర్రు గ్రామదేవత గంగానమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా ముగిసింది. ఉత్సవ మూర్తులైన అమ్మవారి ఘటం, పోతురాజుగెడలు ఉదయం స్థానిక నాయిబ్రాహ్మణుల కాలనీ, జమ్మిచెట్టుసెంటరు, మునసబు బజారు, బందెలదొడ్డి బజారుమీదుగా సంతబజారు ప్రాంతాల్లో సంచరించారు. తమ కుటుంబాలను చల్లగా ఆశీర్వదించమ్మా అంటూ పోట్టేళ్లు, పోతులను గడిచుట్టూ తిప్పారు. సాంప్రదాయ మొక్కులున్న పిల్లలు పెద్దలు తలపై గండ్రదీపాలు ఉంచుకుని మెడలో గారెలు, బూరెలదండలు ధరించి మేళాతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య రోడ్లపై చలువ వస్త్రాలతో నడుచుకుంటూ వచ్చి వాటిని అమ్మవారికి సమర్పించారు. పంబలవారు మంత్రోచ్చరణల మధ్య కుంభం పోసి, గుమ్మడి కాయకొట్టి అమ్మవారికి మహానైవేద్యం సమర్పించారు. తొలి నైవేద్యం గ్రామ తొలి మునసబు ఇంటి వారసుల నుంచి వచ్చింది. ఆలయ ప్రాంగణం విద్యుత్ కాంతుల వెలుతురులో మెరిసింది. ఎమ్మెల్యేవర్ల కుమార్‌రాజా, మాజీఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్ , జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సీఐ పి.శుభకర్, ఎస్సైలు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో సర్కిల్‌పరిధిలోగల బందోబస్తు ఏర్పాటుచేశారు. దాతలు వితరణతో పులిహోర లడ్డూలు, 10వేల మంచినీటి ప్యాకెట్లు, మజ్జిగా ప్యాకెట్లను పంపిణీ చేశారు.



భక్తులతో పోటెత్తినఅమ్మవారి ఆలయం

యువకుడి హత్య కేసులో నలుగురి అరెస్ట్

పామర్రు,మార్చి9(ఆంధ్రజ్యోతి): ఇటీవల మొవ్వమండలం కాజ గ్రామంలో చోటుచేసుకున్న హత్య కేసులో నిందితులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈమేరకు స్థానిక సీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్‌వినీల్ వెల్లడించారు. మొవ్వమండలం కాజ గ్రామానికి చెందిన రాజులపాటి వెంకట రాజేష్(27)ని పాతకేసులు రాజీ చేసుకుందామని చెప్పి ఈనెల 5న తాతా హరికృష్ణ అనే వ్యక్తి ఇంటికి పిలిపించుకున్నాడు. అనంతరం హత్యచేసి కాజ కాలువలో పడేశారని మృతురాలి తల్లి రాజులపాటి రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు పథకం ప్రకారమే వెంకటరాజేష్‌ను రాత్రి సమయంలో కేసులు రాజీచేసుకుందాం అని పిలుపించుకుని అతనిపై కర్ర, ఇనుపరాడ్‌తో కొట్టి చంపి కారులో మృతదేహన్ని తీసుకెళ్లి కాలువలో పడేసినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిందన్నారు. నిందితులైన తాతా హరికృష్ణ, జోగి శివన్నారాయణ, మందా మధుసూదనరెడ్డి, బొల్లాశ్రీనివాసరావులను నిడుమోలు సమీపంలోగల వేణుగోపాల లేవుట్స్ వద్ద శనివారం రాత్రి అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితుల హత్యకు వినియోగించిన కారు ఏపీ 39ఎల్‌వై 7114తోపాటు, హత్యకు వినియోగించిన కర్ర, ఇనుపరాడ్‌ను వారినుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు దర్యాప్తును త్వరితగతిన చేపట్టి నిందితులను అరెస్టుచేసిన పామర్రు సీఐ సుభాకర్, కూచిపూడి ఎస్సై సుబ్రమణ్యంని డీఎస్పీ అభినందించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ధీరజ్‌వినీల్

వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న వెనిగండ్ల రాము

గుడివాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : వేణుగోపాలస్వామి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక ప్రజావేదికలో వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడలో ఆధ్యాత్మిక శోభను పెంపొందించే కార్యక్రమాలకు తాను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల హామీ ఇచ్చారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుండి 14వ తేదీవరకు వార్షిక బ్రహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 13వ తేదీ సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, రమా సమిత సత్యనారాయణస్వామి కళ్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, వేదపండితులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. వల్లూరుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విజయవాడ సెంటినీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారుఈ వైద్యశిబిరంలో గుండె, షుగర్, బిపి, మెదడు, వెన్నెముక, నరాలు, ఎముకలు, జీర్ణకోశ తదితర వ్యాధులకు డాక్టర్ కాగిత గోపీచంద్, ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు శివరామ్‌ప్రసాద్, హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు బడుగు శ్రీకాంత్, ప్రధాన కారదర్శి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పూర్ణచంద్రరావు, శ్రీధర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నారాయణరావు, ఎమ్మెల్యే కుమార్ రాజా

ఘనంగా రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

కూచిపూడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని బాలాత్రిపుర సుందరి దేవి సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేయటంతో పాటు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి పర్యవేక్షణలో విశేష పూజలు నిర్వహించారు. పెనుమూడి సతీష్ కుమార్, పూర్ణ చంద్రశేఖరశర్మ, సుబ్రహ్మణ్యేశ్వర శర్మల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి

గుడివాడ,మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్య పరిరక్షణకు తగు జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ వైద్యులు, రొటేరియన్ డాక్టర్ చింతపల్లి సుగుణావతి పేర్కొన్నారు. శనివారం రాత్రి రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ రాయల్ క్రూయిజ్‌లో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు టి.ఎన్ రాజశేఖర్ క్లబ్ కార్యదర్శి కిరణ్ బాబు, పూర్వ అధ్యక్షులు ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, రమణమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



డాక్టర్ సుగుణావతిని సత్కరిస్తున్న గుడివాడ రోటరీ క్లబ్ సభ్యులు

గుడివాడ : రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి సమిష్టిగా కలిసి నడుద్దామని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినత్సోవ వేడుకల్లో భాగంగా వైష్ణవిని సత్కరించారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి రంగప్రసాద్, వాకర్స్ గవర్నర్ సుబ్బారావు, డిప్యూటీ గవర్నర్ కేశవరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రసాదరావు, డీఆర్‌బీ ప్రసాద్ పాల్గొన్నారు.



వైష్ణవిని సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



మిద్దెతోట రైతులను సత్కరిస్తున్న శివకుమార్ తదితరులు

మిద్దె తోటల పెంపకంపై అవగాహన

గుడివాడ, మార్చి 9(ఆంధ్రజ్యోతి) : మన ఆహారాన్ని మనమే పండించుకుని తింటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని విజయవాడ టెర్రస్ గార్డెన్ అసోసియేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం గుడివాడలోని గౌరీశంకరపురంలో విజయవాడ టెర్రస్ గార్డెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిద్దె తోటల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం లభించాలంటే టెర్రస్ గార్డెన్ లాంటి పెరటి తోటలు పెంచడంతోనే సాధ్యమవుతుందన్నారు. మిద్దె తోటలను ప్రోత్సహించాలని కోరారు. అనంతరం మిద్దె తోట మహిళా రైతులను ఘనంగా సత్కరించారు. శివకుమార్, అనీల్, గౌస్, విమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలి

గుడివాడ రూరల్,మార్చి 9(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు ప్రతీ రోజు తరలించాలని మండల ప్రత్యేకాధికారి పి.సాల్మన్‌రాజు అన్నారు. బొమ్ములూరులో సిబ్బంది సేకరిస్తున్న తడి, పొడి చెత్తను ఆదివారం ఆయన పరిశీలించారు. పంచాయతీ సిబ్బందికి ఏ విధంగా చెత్తను సేకరించాలి, ఇంటింటికి వెళ్లి వారికి అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని సూచించారు. ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్ ఈవోపీఆర్‌డీ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతి కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన భూసేకరణకు నిధుల మంజూరు

పమిడిముక్కల : పైడికొండలపాలెంలోని ఎస్సీకాలనీ వాసులకు ఎట్టకేలకు శ్మశానభూమి ఏర్పడింది. రాష్ట్రలోకాయుక్త న్యాయాధికారి పి.రజని ఆదేశాలతో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ విజయ్ కృష్ణన్ శ్మశాన భూమి నిమిత్తం భూసేకరణకు రూ.38,00,178 నిధులు మంజూరు చేశారు. కాలనీలో 175 కుటుంబాల వారు మృతదేహాలను ఖననం చేసేందుకు అవసరమైన స్థలం లేక రోడ్డు మార్జిన్‌ను ఉపయోగించుకుంటూ ఇబ్బంది పడుతున్న వైనాన్ని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ లోకాయుక్తకు 2023వ సంవత్సరంలో ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత పామర్రు శాసన సభ్యుడు వర్లకుమార్ రాజా సహకారంతో సమస్యకు పరిష్కారం లభించడంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కూచిపూడి : జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో సమస్య పరిష్కారానికి ఉద్యమ బాట పడతామని సీపీఎం బృందం హెచ్చరించింది. మొవ్వ మండలంలోని పెదపూడి కాలనీలో ఆదివారం పర్యటించి కాలనీ వాసులను అడిగి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. అంతర్గత రహదారులు, విద్యుత్ సమస్యలు, ప్లాట్ల మెరక పనులు, తాగునీటి సమస్య, మురుగు నీటి సమస్యలు కాలనీలో తిష్ట వేశాయని స్థానికులు ఏకరవు పెట్టారు. కాలనీ వాసులు ఎన్ని పర్యాయాలు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండాపోయిందని సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణ రావు పేర్కొన్నారు. సమస్యల పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాజశేఖర్, వెంకటేశ్వరరావు, టి.శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

14 మద్యం సీసాలు స్వాధీనం

గుడివాడ: కైకాలవారి వీధిలోని కె.శివకుమార్‌కు చెందిన బెల్టు షాపుపై ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. అతని వద్ద 14క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై హేమ సుస్మిత, హెడ్ కానిస్టేబుల్ కె.శివరామ్‌లు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.ల్లో)
బ్రాయిలర్ బర్డ్	85, 92, 102
చికెన్ విత్ స్కిన్	160
చికెన్ స్కిన్‌లెస్	170

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.420



బాధితురాలికి సీఎం సాయం

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : 26వ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పసుపులేటి పుణ్యవతికి సీఎం సహాయనిధి కింద ప్రభుత్వం అందించిన రూ. 75 వేల చెక్కును టీడీపీ నాయకులు అందజేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, క్లస్టర్ ఇన్‌ఛార్జి అక్కుమహంతి రాజా అందజేశారు. మురాల ప్రసాద్, షేక్ మౌలాలి, షేక్ బాషా, మురాల బ్రహ్మం, వన్నెంరెడ్డి ప్రసాద్, ఎండి జిలానీ, షేక్ ఆసీఫ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అవనిగడ్డ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నాగాయలంక రోడ్డులోని కొత్త సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి తుంగలవారిపాలెం విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలను తొలగించేందుకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తసబ్‌స్టేషన్, గుడివాకవారిపాలెం, తుంగలవారిపాలెం, వేకనూరు గ్రామాల్లోని గృహాలకు, వ్యవసాయ మోటార్లకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

టిప్పర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

పెడన, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పెడన - గుడివాడ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పెడన మండలం కోటవానిపాలెంకు చెందిన ఓలేటి నవీన్ (27), పేరం విజయకుమార్ (28) ఆదివారం ఉదయం మినుము నూర్పిళ్ల పనుల నిమిత్తం బైక్‌పై గుడివాడ వెళుతుండగా బైపాస్ రోడ్డు సమీపంలో టిప్పర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నవీన్, విజయకుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై జి. సత్యనారాయణ ప్రమాద స్థలానికి చేరుకుని బాధితులను మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నాగాయలంక, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పెదపాలెం గ్రామంలోని కొల్లూరి బసవేశ్వరరావు ఇంట్లో 700 కేజీల రేషన్ బియ్యాన్ని పీడీఎస్ డీటీ కాశింబాబు, వీఆర్వో జి.కృష్ణబాబు పట్టుకున్నారు. ప్రభుత్వ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినందుకు బసవేశ్వరరావుపై 6ఏ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అదే గ్రామంలోని రేషన్ డీలర్ కైతేపల్లి రేఖ షాపునకు అప్పగించినట్లు డీటీ కాశింబాబు తెలిపారు.


జోశ్యులవారితోటలో ప్రతిష్ఠా మూర్తులకు పూజలు చేస్తున్న విష్ణుభట్ల సూర్యనారాయణ


చేవేంద్రలో ప్రతిష్ఠకు హాజరైన భక్తులు, పూజలు చేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత


పులిగడ్డ కనకదుర్గమ్మకు వెండి కిరీటం అందజేస్తున్న భక్తులు

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

జోశ్యులవారితోటలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ నేడు ● చేవేంద్రలో చెన్న మల్లేశ్వరస్వామి ప్రతిష్ఠ ● పులిగడ్డలో కనకదుర్గ ప్రతిష్ఠ రేపు

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : జోశ్యులవారితోటలో పునర్నిర్మిత రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నాలుగు రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రతిష్ఠా మూర్తులకు బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ ఘనాపాటి విశేష పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. గత మూడు రోజులుగా విశేష పూజలు, ప్రతిష్ఠా మూర్తుల ఊరేగింపు జరగ్గా, సోమవారం ప్రతిష్ఠా మహోత్సవం బ్రహ్మశ్రీ విష్ణుభట్ల సూర్యనారాయణ ఘనాపాటి బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, గర్భాలయంలో బీజన్యాసం, గర్తన్యాసం, రత్నన్యాసం, ధాతున్యాసం, మూలమంత్ర హోమాలు ఉదయం గం.9.12లకు యంత్ర స్థాపన, గం.9.18లకు సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి పాలరాతి విగ్రహాల ప్రతిష్ఠ జరుగుతాయన్నారు. ఉదయం గం.10.30లకు మహా పూర్ణాహుతి, గం.11.30లకు భారీ అన్నసమారాధన జరుగుతాయన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గొర్రె హరిబాబు, ఉపాధ్యక్షుడు పుప్పాల శివకుమార్, సెక్రటరీ డి.వి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ పుప్పాల బాల ఆంజనేయ సూర్యప్రసాద్, కోశాధికారి కొలసాని శ్రీహరి, కార్యవర్గ సభ్యులు గోపిశెట్టి చిత్తరంజన్ ఫణిధర్, బుద్ధన నాగవెంకట కిషోర్‌కుమార్, రావి మౌలాలి, గొర్రె వెంకటరత్నం (రాము), బుద్ధన మస్తాన్ బాబు (బాబి), రావి మణికంఠ, దేవనబోయిన రవి పర్యవేక్షణలో ప్రతిష్ఠా మహోత్సవాలు జరుతున్నాయన్నారు.


ప్రతిష్ఠా పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

పెడన/పెడన రూరల్ : చేవేంద్ర గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ పి. సత్యనారాయణ శాస్త్రి నేతృత్వంలో ఆదివారం ఉదయం 10.52 గంటలకు ఆలయంలో ఉమాపార్వతీ సమేత చెన్న మల్లేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ విచ్చేసి ఉమా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గుడివాడకు చెందిన మురళీకృష్ణ భజన సమాజం ప్రదర్శించిన కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రతిష్ఠ అనంతరం ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అంకెం చినసుబ్బారావు పర్యవేక్షించారు.

పులిగడ్డలో ప్రతిష్ఠా మహోత్సవాలు నేటి నుంచి

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠ జీవ ధ్వజ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు మండలి వెంకట కృష్ణారావు (బాబు) తెలిపారు. ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా 10వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, అంకురారోపణ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రెండో రోజైన మంగళవారం గణపతిపూజ, నిత్య హోమాలు, దేవతా మూర్తుల హోమాలు, ఈనెల 12వ తేదీ ఉదయం 10.39 నిముషాలకు కనకదుర్గమ్మ ఆలయం ప్రారంభోత్సవం, దేవతా మూర్తుల ప్రతిష్ఠ జరుగుతాయన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా జరిగే ప్రతిష్ఠా మహోత్సవంలో దివిసీమలోని భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పులిగడ్డ కనకదుర్గమ్మకు వెండి కిరీటం

అవనిగడ్డ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు వెండి కిరీటాన్ని ఆదివారం సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన ఎల్.బాలాజీ - ఈశ్వరి దంపతులు రూ.50 వేల విలువైన 500 గ్రాముల వెండి కిరీటాన్ని ఆదివారం ఆలయ నిర్వాహకులు మండలి వెంకట కృష్ణారావు (బాబు)కి అందజేశారు. దాతలను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.



ఉల్లిపాలెంలో నూకాలమ్మ సంబరం

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం పోతేపల్లి శివారు ఉల్లిపాలెం గ్రామంలో ఆదివారం నూకాలమ్మ సంబరం వైభవంగా జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కుబడులు సమర్పించారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న మచిలీపట్నం ఆర్యవైశ్య యువజన సంఘ కార్యవర్గం

ఆర్యవైశ్య యువజన సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవాధ్యక్షుడుగా వెచ్చా మల్లిఖార్జున గుప్తా, అధ్యక్షుడుగా మామిడి దుష్యంతకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి మచిలీపట్నం సీతారామ కన్వెన్షన్ హాలులో ఆర్యవైశ్య యువజన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆర్యవైశ్య యువజన సంఘ ఉపాధ్యక్షులుగా కొల్లిపర వెంకట గోపాల మణికంఠ, ఉడత్తు హనుమాన్, గుండు కిరణ్, బొడ్డు విశాల్‌కుమార్, వంకాయల సూర్యప్రకాష్, మాటూరి జయశంకర్, ఉడత్తు వెంకట దత్త, బొడ్డు కాశీనరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా మామిడిశెట్టి శివప్రసాద్, అదనపు ప్రధాన కార్యదర్శిగా గుండా సాయిశరణ్, కోశాధికారిగా ఉడత్తు సాయికిరణ్ ఎన్నికయ్యారు. కార్యవర్గంతో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయిశ్రీనివాస్, వెచ్చా మల్లిఖార్జున గుప్తా, చక్కా చెన్నకేశవరావు, మామిడి వెంకటవరప్రసాదరావు ప్రమాణ స్వీకారం చేయించారు. మాటూరి రంగనాథ్, మామిడి వేణుగోపాలరావు, మామిడి మురళీకృష్ణ, వేముల కృష్ణ, పద్మనాభుని నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను సమష్టిగా విజయవంతం చేద్దాం

మోపిదేవి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ సభను సమష్టిగా విజయవంతం చేయాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైన ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభను పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయిలో సన్నాహక సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు బోనం పాపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మండలంలోని కె.కొత్తపాలెం, పెదకల్లేపల్లి, ఉత్తర చిరువోలులంక, కోసూరువారి పాలెం, మోపిదేవి, కొక్కిలిగడ్డ గ్రామాల నుంచి 60 మంది కార్యకర్తలు వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి చేరారు. మండలి బుద్ధప్రసాద్ వారికి జనసేన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మండలి వెంకట్రామ్, మత్తి వెంకటేశ్వరరావు, రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు, పూషడపు రత్నగోపాల్, దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి

కలయిక సేవలు స్ఫూర్తిదాయకం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కలయిక స్వచ్ఛంద సంస్థ సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి రవీంద్ర, ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. కలయిక సంస్థ ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది వేడుక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకలపూడి నుంచి కోనేరుసెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. దివంగత ఎమ్మెల్యే వంగవీటి రంగా విగ్రహానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరి, బొర్రా విఠల్, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా కాంస్య విగ్రహం నెలకొల్పాలని బుల్లెట్ ధర్మారావు కోరారు. గోల్డ్ ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు, డాక్టర్ అల్లాడ శ్రీనివాసరావు, జ్యూయలరీ పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, వాలిశెట్టి మల్లి, సువర్ణకల్యాణమండపం చైర్మన్ రమేష్, మాజీ మునిసిపల్ కార్పొరేటర్ కొట్టె వెంకట్రావు, కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



పెడన జడ్పీ 1976-77 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పెడన, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా జరిగింది. ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తరలివచ్చి ఆత్మీయ కలయికలో పాల్గొని సందడి చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. గురువులు గోవర్ధనరావు, ప్రభాకరరావు, తేజోవతి, భానుమతిలను ఘనంగా సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు. పూర్వ విద్యార్థి, ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ కలయికకు చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భట్ట మీనాకుమార్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.


బొగ్గుతో చిత్రాన్ని గీస్తున్న అంబికాదేవి

ఘనంగా దామెర్ల రామారావు జయంతి

మచిలీపట్నం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు నేటి చిత్రకారులకు మార్గదర్శి అని స్టార్ విద్యాసంస్థల అధినేత పి.శ్రీరాం అన్నారు. మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం దామెర్ల రామారావు జయంతి ఘనంగా నిర్వహించారు. పెన్సిల్‌తో కె. శివకుమార్, రంగులతో పి.చిదంబరం అప్పటికప్పుడు చిత్రాలు గీశారు. ఏలూరుకు చెందిన జాతీయ కళాకారిణి అంబికా దేవి బొగ్గుతో చిత్రాన్ని గీసి మంత్రముగ్ధులను చేశారు. ప్రముఖ చిత్రకళాకారుడు అక్షరశిల్పి తిరునగరి బి. దుర్గారావు, కార్టూనిస్టు టి. వెంకటేశ్వరరావు, నందం శ్రీనివాస్ పాల్గొన్నారు. మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు లలితా మోహన్, కార్యదర్శి, చిత్రకారుడు బి.ఎస్.వి. రమేష్ నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీ కుమారి, నందం శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. కృష్ణప్రసాద్, ప్రభాకర్, రామారావు పాల్గొన్నారు.

పోలీసు సూచనలు పాటించాలి

కోడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మెరైన్ పోలీసుల సూచనల మేరకే పర్యాటకులు హంసలదీవి బీచ్‌లో స్నానాలు ఆచరించాలని మెరైన్ ఎస్సై పూర్ణమాధురి తెలిపారు. హంసలదీవి బీచ్ వద్దకు విచ్చేసిన పర్యాటకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. తీరం వెంబడి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గస్తీ నిర్వహించారు.



మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళం

చల్లపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మన కోసం మనం ట్రస్ట్‌కు గ్రామ ప్రముఖులు ఉప్పాల ఏడుకొండలు రూ.10,116 విరాళంగా అందజేశారు. కుమార్తె డాక్టర్ విజయలక్ష్మి వివాహం సందర్భంగా స్వచ్ఛ ఉద్యమ ఖర్చుల కోసం విరాళాన్ని ఆదివారం 3407వ రోజు స్వచ్ఛసేవలో పాల్గొని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు చెక్కు అందజేశారు. డాక్టర్ పద్మావతి, వేముల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

ఘంటసాల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు బౌద్ధ సంప్రదాయాలతో బౌద్ధ గురువు బంతేజీ ఆదివారం భూమి పూజ చేశారు. బంతేజీ మాట్లాడుతూ బౌద్ధం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని చాటుతుందన్నారు. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి తన వంతుగా బంతేజీ రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆక్విడెక్ట్ రెయిలింగ్ పనుల పరిశీలన

అవనిగడ్డ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ ఆక్విడెక్ట్ రెయిలింగ్ పనులను తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ఆదివారం పరిశీలించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో ఆక్విడెక్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, కోడూరు మండల జనసేన అధ్యక్షుడు మర్రే గంగయ్య, ఉల్లిపాలెం నీటి సంఘ అధ్యక్షుడు ఇజ్జినేని శివాజీ, పూతబోయిన కరుణ కుమార్, బాసు శివ ప్రసాద్, దేవనబోయిన కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన

కోడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ దివిసీమ, మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అన్నం అన్నపూర్ణమ్మ ఛారిటీస్ సౌజన్యంతో ఆదివారం జరిగిన ఉచిత గుండె వైద్య శిబిరం జరిగింది. విజయవాడకు చెందిన మెడ్‌స్టార్ హాస్పటల్ వైద్య సిబ్బంది పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరానికి అన్నం అన్నపూర్ణయ్య చారిటీస్ అధ్యక్షుడు అన్నం శ్రీనివాస్ ఆర్థిక సహకారం అందించారు సుమారు 350 మందికిపైగా వైద్యసేవలు అందుకున్నారు. వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు బూరగడ్డ హరనాథ్ బాబు, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు మద్దాలి ప్రసాద్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జూపూడి సుభాష్ చంద్ర బోస్, వాసవీ క్లబ్ దివిసీమ అధ్యక్షులు కోడూరు వెంకట సత్యనారాయణ, అద్దెపల్లి సత్యనారాయణ, బుద్దా శ్రీనివాస్, కొమ్మూరి పేరేశ్వరరావు, అమరా గోవిందరాజులు, గుర్రం సీతా ఆంజనేయులు, అన్నం వెంకటేశ్వరరావు, అద్దెపల్లి బాలచంద్ పాల్గొన్నారు.